నల్లకుంటలో రూ.2.5 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

● అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి ● ఎమ్మెల్యే వెంకటేష్

నల్లకుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లో రూ.2.5 కోట్లతో నూతన సీసీ రోడ్లను నిర్మిస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఈ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ పనులపై ఏ మాత్రం నిర్లక్ష్యం వ్యవహరించినట్లయితే సహించేది లేదన్నారు. బుధవారం డివిజన్‌లోని నర్సింహబస్తీలో రూ.5 లక్షలతో మంచినీటి పైప్‌లైన్, రూ.40 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బస్తీలో ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లోని బాయమ్మ గల్లీ వీధిలో రూ.1.30 కోట్లతో త్వరలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌లోని పలు బస్తీల్లో అప్పట్లో జనాభాకు అనుగుణంగా ఏర్పాటు చేసిన మంచి నీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల వ్యవస్థను ఆధునికీకరణ చేస్తున్నామన్నారు. తర్వాత ఆయా ప్రాంతాల్లో సీసీరోడ్లను నిర్మిస్తున్నామన్నారు. ఈ విషయంలో జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం విష్ణువర్ధన్, ఏఈ రోహిత్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్, బీజేపీ అధ్యక్షుడు మేడి ప్రసాద్, ప్రశాంత్‌జోషి, సీనియర్ నాయకులు ఎం.భూపతినాథ్, ఇర్ఫానా స్సుల్తానా, కేజే.బాబు, నవీన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



నర్సింహబస్తీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ అమృత

● ఎన్టీఆర్‌కు నివాళి



మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద బుధవారం పలువురు పూలతో ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ అభిమానులు, బీజేపీ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి చిట్టి శ్రీధర్, తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షుడు కేపీ.మురళీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంగౌడ్ తదితరులు నివాళులర్పించారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

● ఫీవర్ ఆస్పత్రిలో సంబరాలు



రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిస్ట్ గ్రేడ్2 హోదాను ఫార్మసీ ఆఫీసర్‌గా మారుస్తూ జీవో జారీచేసిన సందర్భంగా బుధవారం నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రిలో సంబరాలు జరుపుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ కేక్‌కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, డీసీఆర్ఎంవో విజయలక్ష్మి, ఫార్మసీ ఆఫీసర్లు ఉమాదేవి, గ్లోరీ, మౌనిక, నళిని, శ్రీతేజ, విజయకళ, లావణ్య, కీర్తి, ఉమ, రాఘవేంద్ర, సురేష్, పాల్, జయ, గోపి, నవనీత, శ్రీకాంత్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు. - బర్కత్‌పుర

పొంగిపొర్లుతున్న మురుగునీరు

రాంనగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని ప్రగతి వెల్ఫేర్ అసోసియేషన్ వీధిలో పదిరోజులుగా డ్రైనేజీ మురుగునీరు పొంగి పొర్లుతోంది. దీంతో వీధులన్నీ మురికి కూపంగా మారాయి. స్థానికులు ఇళ్ల నుంచి బయటకు ఆ మురుగునీరు నుంచే వెళ్తున్నారు. ఈ దుర్వాసన వల్ల చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ సమస్యపై జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రగతి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్ ఆరోపించారు. వర్షాలు ప్రారంభం కావడంతో ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందన్నారు. ఇకనైనా సమస్యను పరిష్కరించని పక్షంలో ప్రజలతో కలిసి జలమండలి కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు.



ప్రగతి వెల్ఫేర్ వీధిలో పొంగిపొర్లుతున్న మురుగునీరు

వరదనీటితో ఇబ్బందులు రాకుండా చర్యలు

చిక్కడపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్ నాలా వెంబడి ఉన్న బస్తీల్లో నివసిస్తున్న ప్రజలకు వర్షవరదనీటి వల్ల ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. డివిజన్‌లోని అశోక్‌నగర్ స్ట్రీట్‌నెంబర్2 వద్ద జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది నిర్వహిస్తున్న డీసిల్టింగ్ పనులను మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నేతలతో కలిసి ఆమె బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా నాలా ద్వారా లోతట్టు ప్రాంతాలలోకి వరదనీరు చేరకుండా నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టిని తొలగించేందుకు డీసిల్టింగ్ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, సీనియర్‌నేతలు శ్రీకాంత్, పి.నర్సింగ్‌రావు, ఆనంద్‌రావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో బీసీలకు స్థానం కల్పించాలి

చిక్కడపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో బీసీలకు స్థానం కల్పించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి తెలంగాణ బీసీ ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె.మహేందర్ మాట్లాడుతూ జనాభాలో అధికశాతం ఉన్న బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం తగు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కోఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సునీల్‌కు నివాళి

నల్లకుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రాష్ట్ర కోశాధికారి, వైష్ణవ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మంత్రి సునీల్ సంస్మరణ సభను బుధవారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో నిర్వహించారు. బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి, వైష్ణవ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, ఇతరులు పాల్గొని మంత్రి సునీల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ ఉపాధ్యక్షుడు కాణాల శ్యామ్, బ్రాహ్మణ ఆఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, నాయకులు దేవులపల్లి రంగారావు, చెన్నూరి లక్ష్మీనరసింహారావు, పొచంపల్లి మోహన్‌రావు, అక్కిరాజు దుర్గాప్రసాద్, ప్రసాద్‌రావు, గంప రామశర్మ, దేవులపల్లి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

నల్లకుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): నాడు మాత రమాబాయి అంబేడ్కర్ ప్రజాహితం కోసం చేసిన సేవలు చిరస్మరణీయం అని తెలంగాణ రాష్ట్ర మాలల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి కొనియాడారు. బుధవారం నగరంలోని సంఘం కార్యాలయంలో మాత రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం విద్యాభ్యాసం, ప్రజోపయోగం కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి మాత రమాబాయి అంబేడ్కర్ అని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, మే 28 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపిన వివరాల ప్రకారం... 36 నుంచి 40 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో జామైఉస్మానియా రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై ఆకుపచ్చ రంగు షర్ట్, నీలి రంగు ట్రాక్ షర్ట్ ఉంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, మే 28 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని దామోదరం సంజీవయ్యనగర్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని 55 నుంచి 60 సంవత్సరాల ఓ వ్యక్తి ఎస్‌బీఐ కాలనీ సమీపంలో దామోదరం సంజీవయ్యనగర్‌లో పడిఉన్నాడని సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు వెంటనే గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గానీ లేదా 8712660145కి గానీ ఫోన్ చేసి సమాచారం అందించాలని గాంధీనగర్ ఎస్ఐ నర్సింహ కోరారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ

రాంనగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల కీర్తి ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అధ్యక్షతన ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బర్త్‌డేకేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి సీఎం అయిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పేద ప్రజల కష్టాలు, కన్నీళ్లు తొలగిపోయాయన్నారు. సాయిబాబా మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా ఆయన కుటుంబం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, పరుశరామ్, ఎం.ఎ.సిద్ధికి, నాగునగేష్, ఎస్.ప్రకాష్, కట్ట రాములు, ప్రమీళ, ఝాన్సీ, శ్రీనివాస్‌గౌడ్, శ్యాంసుందర్, వెంకటేష్‌చౌదరి, ధన్‌రాజ్; భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● చిక్కడపల్లిలో మాజీ కార్పొరేటర్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధానకార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఎం.చంద్రమోహన్‌గౌడ్, నాయకులు ఉదయ్‌కుమార్, శంకర్, గోపాల్, శివకృష్ణ, సాయి, పుల్లయ్య, యాదగిరి, అన్నపూర్ణ, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

● అంబర్‌పేటలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఓ.వెంకటేష్‌చౌదరి ఆధ్వర్యంలో పటేల్ నగర్ చౌరస్తాలో టీడీపీ కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరశురాం, మెట్టు ధన్‌రాజ్, నరసింహగౌడ్, సాయికుమార్ తదితరులుపాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి ఎన్టీఆర్ కృషి

చిక్కడపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధికి మాజీ సీఎం ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారని ఎన్టీఆర్ వీరాభిమాని, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ జనరల్ బంటారం యాదగిరిగౌడ్ పేర్కొన్నారు. పేద ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ఎన్టీఆర్ ఘాట్‌లో ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు శంకర్‌గౌడ్, చిట్టి శ్రీధర్, మురళి, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ, సాయిబాబా

ఎన్టీఆర్ నటుడిగానే కాదు వ్యక్తిగానూ ఉన్నతుడు

చిక్కడపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ నటుడుగానే కాకుండా వ్యక్తిగా కూడా ఉన్నతుడని విశ్రాంత ఐఏఎస్ అధికారి డా.కే వీ.రమణాచారి అన్నారు. ఆయన నటజీవితం, రాజకీయ జీవితాన్ని తెలుగు ప్రజలు మరో వందేళ్లు గుర్తుపెట్టుకుంటారని అనడంలో అతిశయోక్తి లేదని పేర్కొన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రఖ్యాత రంగస్థల నటుడు తుర్లపాటి రాధాకృష్ణమూర్తికి ఎన్టీఆర్ అవార్డు ప్రదానసభ జరిగింది. రమణాచారి మాట్లాడుతూ రాధాకృష్ణమూర్తికి సత్కారం తెలుగునాటక రంగానికి సత్కారం అని అభివర్ణించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటిపార్వతీశం మాట్లాడుతూ పౌరాణిక సినిమాల్లో నాయక ప్రతినాయక పాత్రలను పోషించి మెప్పించిన వారు ఎన్టీఆర్ అన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు, సినీనటుడు సుబ్బరాయశర్మ, రామకోటేశ్వరరావు, మల్లాది రాధాకృష్ణ, భాస్కర్, రఘురామ్, సుబ్బారావు పాల్గొన్నారు.



తుర్లపాటి రాధాకృష్ణమూర్తికి అవార్డును బహూకరించి సత్కరిస్తున్న అతిథులు

తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలి

నల్లకుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ యాకర అమృత బుధవారం నల్లకుంట డివిజన్‌లోని మయూరీ వీధి తాగునీటి లైన్‌ను పరిశీలించారు. ఈ సమస్యపై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కార్పొరేటర్ అమృత, బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన జలమండలి ఎండీ ఈ సమస్యపై పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్ జోషి, బీజేవైఎం రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు ఎస్.రాంజగదీష్ ముదిరాజ్, నాయకులు కేజే.బాబు, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మకు బోనాలు

ముషీరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం బల్కంపేట ఎల్లమ్మతల్లికి బోనాలను సమర్పించారు. ముషీరాబాద్ నుంచి బీజేపీ మహిళామోర్చా నాయకులు బోనాలతో బయల్దేరి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, బీజేవైఎం నగరకార్యదర్శులు అనిల్‌కుమార్, అజయ్‌గుప్తా, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఆయూష్, బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మహోన్నత వ్యక్తి వీరసావర్కర్

బర్కత్‌పుర, మే 28 (ఆంధ్రజ్యోతి): దేశంకోసం జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి వీరసావర్కర్ అని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవిలు అన్నారు. బుధవారం కాచిగూడ చౌరస్తాలో జయంతి సందర్భంగా వీరసావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం జీవితాంతం జైల్లో గడిపిన వీరసావర్కర్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఆంగ్లేయులను ఎదిరించిన మహావీరుడు వీరసావర్కర్ అని ఆయన జీవిత చరిత్ర పోరాట ప్రతిమను పాఠ్యాంశాలలో పూర్తిస్థాయిలో చేర్చి నేటి విద్యార్థులకు అందించాలని వారు కోరారు. వీరసావర్కర్‌ను స్మరించుకోవడం అంటే ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. త్యాగధనులను జాతి ఎప్పటికి మర్చిపోదని వారి ఆశయ సాధనలో ముందుకు వెళ్లడమే వీరసావర్కర్‌కు నిజమైన నివాళి అని వారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర ఉపాధ్యక్షులు కన్నె రమేష్ యాదవ్, కోశాధికారి ఏ.సూర్యప్రకాష్‌సింగ్, నాయకులు సుభాష్‌పటేల్, భీమ్‌రాజ్, క్షీరసాగర్, అరవింద్, వాసు, ఆర్.సంతోష్, బాలప్రసాద్, రమేష్, పంకజ్, మిలిందా, సూరి, అజయ్, రవియాదవ్ పాల్గొన్నారు.

● సమరయోధుడు వీరసావర్కర్ జయంతి సందర్భంగా కాచిగూడ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు, నాయకులు తరుణ్‌జిత్‌సింగ్, రవీందర్, గోపాల్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.



వీరసావర్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న డాక్టర్ గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, తదితరులు




ఆలయంలో పూజలు నిర్వహించిన బీజేపీ మహిళా మోర్చా మహాకాళి జిల్లా అధ్యక్షురాలు అనిత, కార్పొరేటర్ సుప్రియ

సమానత్వం కోసం అహల్యాబాయి కృషి

ముషీరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమానత్వం కోసం అహల్యాబాయి కృషిచేశారని బీజేపీ మహిళా మోర్చా మహాకాళి జిల్లా అధ్యక్షురాలు అనిత కొనియాడారు. బుధవారం అహల్యాబాయి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ మహిళా మోర్చా కమిటీ అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో దేవుని తోటలోని భవాని శంకర ఆలయంలో మహాహారతి, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మంగ, మాధవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'చాకలి'ని ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య

రాంనగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): చాకలి కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానని మాజీమంత్రి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చాకలి ఎస్సీ సాధన సమితి వార్షికోత్సవ మహాసభ, చలో హైదరాబాద్ కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షుడు చాకలి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఎస్సీ సాధన సమితి డిమాండ్‌ను సీఎంతో చర్చించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్ అక్కినపల్లి పున్నయ్య, నాయకులు మాట్లాడుతూ అన్ని పార్టీలు తమ డిమాండ్లను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలన్నారు.



సత్యానగర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, సురేందర్ తదితరులు

డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే గోపాల్

రాంనగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని సత్యానగర్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులకు సూచించారు. బుధవారం సత్యానగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్, కాలనీవాసులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ ఉండదు : సైబర్‌క్రైమ్ అధికారులు

హైదరాబాద్‌సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్ అని భయపెడుతూ సైబర్ నేరగాళ్లు భయపెట్టి వసూళ్లకు తెగబడుతున్నారని.. అసలు డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని సైబర్ క్రైం అధికారులు తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచడంలో భాగంగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ యూనిట్ సభ్యులు బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఏకం యూపీఎస్సీ శిక్షణ కార్యాలయంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త నెంబర్ నుంచి వచ్చే లింక్‌లు తెరవవడం వల్ల ఫోన్ హ్యాక్ అవుతుందన్నారు. నకిలీ లోన్ యాప్స్, ఓటీపీ ఫ్రాడ్, పార్ట్‌టైం, పెట్టుబడి, ట్రేడింగ్ మోసాలు జరిగే తీరు గురించి వివరించారు. అంతేకాకుండా సోషల్ మీడియా వేదికల్లో నకిలీ ఖాతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడితే వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అశోక్‌నగర్-హిమాయత్‌నగర్ రోడ్డు వెడల్పు చేయాలి

చిక్కడపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ చౌరస్తా నుంచి హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు రోడ్డు వెడల్పు చేయాలని టీజేఎస్ ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 15 సంవత్సరాలుగా ఈ డిమాండ్ ఉన్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడంలేదని, గతంలో మంత్రిగా వున్న కేటీఆర్ ఈ రోడ్డును వెడల్పు చేసే ప్రతిపాదనలు చేయాలని అధికారులకు సూచనలు చేశారని గుర్తుచేశారు. నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు ప్రయాణించే ఈరోడ్డు ఇరుకిరుకుగా మారడంతో ట్రాఫిక్ ఇక్కట్లు పెరిగిపోతున్నాయన్నారు. ఈ రోడ్డులో బ్యాంకులు, వ్యాపార వాణిజ్య సంస్థలు, పాఠశాలలు, కార్పొరేట్ స్కూళ్లు విరివిగా వెలిశాయని ఆయన పేర్కొన్నారు.. దీంతోపాటు ఆర్టీసీబస్సు 40 నెంబర్ రూట్ ఈరోడ్డులోనే ప్రయాణిస్తుంది. రెండు బస్సులు అటు ఇటు వచ్చాయంటే ఇక ట్రాఫిక్ సమస్య ఎంత ఉంటుందో చెప్పలేని పరిస్థితి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును వెడల్పు చేయాలని ఆయన కోరారు.

డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు తెరవకండి

చిక్కడపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో రోడ్లపై డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతలు తెరవొద్దని వాటర్‌బోర్డ్ డివిజన్ 5 డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్ సూచించారు. బుధవారం మాట్లాడుతూ మురుగునీటి నిర్వహణ అనేది ఒక గౌరవప్రదమైన పని అని ఈపనిలో భాగస్వాములైన ప్రతి కార్మికుడిని గౌరవిద్దామన్నారు. మ్యాన్‌హోళ్ల నిర్వహణలో మనుషులను నివారిద్దాం యంత్రాలతో పనిచేయిద్దామన్నారు. గుండ్రపు ఆకారంలో గల మ్యాన్‌హోల్స్ మూతలు తెరిచి ఉంటే వెంటనే జలమండలి కస్టమర్ కేర్ 155313 నెంబర్‌కు కాల్‌చేసి సమాచారం అందించాలని కోరారు. స్వచ్ఛ భారత్ సాధనలో మనందరం కలిసి ముందుకు సాగుదామని వారు పిలుపునిచ్చారు.

వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

చిక్కడపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలనేపథ్యంలో అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. బుధవారం జవహర్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజలు, కార్యకర్తలను కలిశారు. నియోజకవర్గంలో వర్షం ప్రభావం అధికంగా ఉంటుంది కాబట్టి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజాసమస్యలు వెంటనే పరిష్కరిస్తామని వివరించారు.

గోవులను తరలించకుండా చెక్‌పోస్టుల ఏర్పాటు

చిక్కడపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గోవులను తరలించడాన్ని నిరోధించేందుకు చిక్కడపల్లి, గాంధీనగర్ పోలీస్ సబ్‌డివిజన్‌ల పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు చిక్కడపల్లి సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చిక్కడపల్లి, ముషీరాబాద్ పీఎస్‌ల పరిధిలోని ఆర్టీసీక్రాస్‌రోడ్, ముషీరాబాద్ చౌరస్తాతోపాటు మొత్తం మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. నిరంతరం పోలీసు సిబ్బంది ఈ చెక్‌పోస్టుల వద్ద ఉండి గోవులను తరలించకుండా పర్యవేక్షిస్తారని వివరించారు.

భరత్‌నగర్‌లో రూ.18లక్షలతో సీసీరోడ్లు

ముషీరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ భరత్‌నగర్‌లో అధ్వానంగా మారిన రోడ్లను పునర్‌నిర్మించేందుకు రూ.18లక్షలతో పనులు ప్రారంభించామని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తెలిపారు. బుధవారం భరత్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, నాయకులు లక్ష్మణ్, వెంకటేష్, బాలకృష్ణ, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

31న ఎంఆర్‌పీఎస్ విజయోత్సవ సభ

ముషీరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 31న జరిగే ఎంఆర్‌పీఎస్ విజయోత్సవ సభ, జాతీయ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు గండి కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. బుధవారం ముషీరాబాద్‌లోని భారత్ సేవా సమాజ్ కమ్యూనిటీ హాల్‌లో ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు రోషన్ వినాయకరావు, నాయకులు శ్రీకాంత్, ఎల్లయ్య, దశరత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.